ప్రజాశక్తి

మంగళవారం 8 నవంబర్ 2022

5

పార్వతీపురం మన్యం

19 నుంచి ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ కార్డుదారులకు బియ్యం

ప్రజాశక్తి - కలెక్టరేట్

జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ) కింద రేషన్ కార్డులు కలిగిన వారికి ఈనెల 19 నుంచి 28 వరకు బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. జిల్లాలో అన్ని మండలాల్లో ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ కార్డుదారులందరికీ ప్రధాన మంత్రి కల్యాణ్ అన్న యోజన (పిఎంజికెఎవై) కింద కేంద్ర ప్రభుత్వం బియ్యం పంపిణీ చేస్తుందని ఆయన చెప్పారు. ఒక్కొక్క లబ్ధిదారునికి ఐదు కిలోల చొప్పున నవంబరు 19 నుంచి 28 వరకు చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ జరుగుతుందని వివరించారు. సందేహాలుంటే జిల్లా పౌర సరఫరాల అధికారి, సంబంధిత తహశీల్దార్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

సమగ్ర శిక్ష ఎపిసిపై ఫిర్యాదులు

ప్రజాప్రతినిధుల వద్ద కెజిబివి సిబ్బంది ఆవేదన

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎపిసి స్వామినాయుడు (ఫైల్)

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా సమగ్ర శిక్ష ఎపిసి స్వామినాయుడు వ్యవహారంపై రాష్ట్ర ఉన్నతాధికారులకు, జిల్లా కలెక్టర్‌కు, ఎసిబి అధికారులకు ఫిర్యాదుల పర్వం కొనసాగుతోంది. ఇటీవల సమగ్ర శిక్షలో పని చేసిన గణాంక అధికారి రమణారెడ్డిని అన్యాయంగా ఎటువంటి తప్పూ లేకుండా ఎపిసి సరెండర్ చేయించారని రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. మరో వైపు అక్రమంగా టెర్మినేట్ చేశారని మెంటాడ కెజిబివి ప్రిన్సిపాల్ ప్రమీలాదేవి రాష్ట్ర అధికారులకు ఫిర్యాదుచేశారు. దీంతో ఇటీవల ఎపిసిపై ఆర్‌జెడి గతనెల 26న విచారణ చేసిన విషయం తెలిసిందే. ఇవే కాకుండా కెజిబివిల పర్యటనకు వెళ్లినప్పుడు చిన్న చిన్న కారణాలు చూపి వేధిస్తున్నారని ఎమ్మెల్యేలకు అయా కెజిబివి ఉద్యోగులు ఫిర్యాదులు చేస్తున్నారు. ఇప్పటికే మన్యం జిల్లా మాజీ, ప్రస్తుత డిప్యూటీ సిఎంలకు ఎపిసి వ్యవహార శైలిపై పలువురు ఫిర్యాదు చేయడంతో వారు ఆగ్రహంతో ఉన్నట్లు తెలిసింది. వీటితో పాటు ఇటీవల అకాలి ధనరావు అనే వ్యక్తి అక్టోబర్ 31న రాష్ట్ర విద్యా శాఖ అధికారులైన కమిషనర్, రాష్ట్ర సమగ్ర శిక్ష పీడీకి, జిల్లా కలెక్టర్‌కు, ఎసిబి డిఎస్‌పికి, డిఇఒకు, ఎస్‌పికి ఎపిసి దందాపై ఫిర్యాదు చేసినట్లు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. మరోవైపు ఈనెల 6న జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలియకుండా సుమారు 400 మంది కెజిబివి ఉద్యోగులతో సమావేశం నిర్వహించడంపై అయా ఉద్యోగులు ఆయన వ్యవహార శైలిపై బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఈమేరకు ప్రజాప్రతినిధులకు కూడా ఫిర్యాదు చేశారు. ఇటీవల రెండు విడత నాడు-నేడు పనులకు సంబంధించి హెచ్‌ఎంలపై తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నారని ఇప్పటికీ వారంతా ఆవేదన చెందారు. ఈనేపథ్యంలోనే హెచ్‌ఎంల అసోసియేషన్ నాయకులు ఎపిసి దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి మార్పు లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ కలుగ చేసుకొని చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఫిర్యాదు వచ్చింది

ఎపిసి స్వామినాయుడుపై విద్యాశాఖ వెబ్‌సైట్‌కు ఆన్‌లైన్ ఫిర్యాదు వచ్చింది. దానిని పరిశీలించాల్సి ఉంది. ఆదివారం కెజిబివి సిబ్బందితో కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన సమావేశం గురించి నాకు తెలియదు.

-వెంకటేశ్వరరావు, డిఇఒ

డైలీవేజ్ పద్ధతిలో నియమించాం : ఎపిసి

ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం 'సమగ్రశిక్షలో ఇష్టారాజ్యం' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎపిసి స్వామినాయుడు స్పందించారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తనపై వచ్చిన ఆరోపణలు వాస్తవం కాదని తెలిపారు. ఎపిసి, డిఇఒ, కలెక్టర్ అనుమతితో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఉండేందుకు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని తాత్కాలికంగా డైలీ వైజ్ పద్ధతిలో నియమించామని తెలిపారు. ఏ ఒక్క పోస్టును ఏడాది కాలంగా ఇంతవరకు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో గాని, కాంట్రాక్టు విధానంలో గాని భర్తీ చేయలేదని పేర్కొన్నారు. సమగ్రశిక్షకు సంబంధించిన ఏ ఫైల్ అయినా డిఇఒ అనుమతితో మాత్రమే జిల్లా కలెక్టర్ ఆమోదానికి పంపుతున్నామని పేర్కొన్నారు. కెజిబివి మెంటాడ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేసిన టి. ప్రమీలా దేవి విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపడం వల్ల చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. సమగ్రశిక్ష కార్యాలయంలో ఫైనాన్సు అండ్ అకౌంట్స్ ఆఫీసర్ గా విధులు చేపట్టిన ఎన్.వి. రమణారెడ్డి పనుల పట్ల జాప్యం చేయడం కారణంగా ఆయనను జిల్లా కలెక్టర్ అనుమతితో మాతృ సంస్థకు సరెండర్ చేశామని తెలిపారు. కెజిబివిల బలోపేతం కోసమే తనిఖీ చేపడుతూ నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతివ్వాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్‌పి వి.విద్యాసాగం ్నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన "స్పందన" కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన కార్యక్రమంలో ఎస్పీ 12 ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, 7 దినాల్లో సమస్యలను పరిష్కరించేం దుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను, వెంటనే తనకు నివేదించాలని అధికారులను ఎస్‌పి ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్, డిసిఆర్ సిఐ ఎన్.వి.ప్రభాకర్, ఎస్ఐ దినకర్, ఎఎస్సై దాలినాయుడు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పష్టం చేశారు. మండల అధికారులతో సోమవారం సాయంత్రం వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పింఛన్ల నిలుపుదలపై స్పందన కార్యక్రమంలో పలు అర్జీలు అందుతున్నాయన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందాల్సిందేనన్నారు. సాంకేతిక సమస్యలుంటే గ్రామ, వార్డు సచివాలయ సమన్వయ అధికారితో సంప్రదించి తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. సంబంధిత సంక్షేమ సహాయకులు బాధ్యత వహించాలని ఆయన పేర్కొన్నారు. పింఛను అందకుండా బాధ్యులయ్యే సంక్షేమ సహాయకుల జీతాల నుంచి పంపిణీ చేసేందుకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో మొబైల్ టవర్ల ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాలను వెంటనే తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని ఐటిడిఎ పిఒను కలెక్టర్ ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలను ప్రతి వారం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని అన్నారు. పాలకొండ, సాలూరు పట్టణ గృహ నిర్మాణాల జాప్యం జరుగుతోందని, దీనిపై సీతంపేట ఐటిడిఎ పిఒ, మునిసిపల్ కమిషనర్లు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జల్ జీవన్ మిషన్ లక్ష్యాలలో ఇప్పటి వరకు 25 శాతం మాత్రమే సాధించారని, వచ్చే ఐదు నెలల్లో శతశాతం సాధించాలని అధికారులను వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, అన్ని విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దీపారాధనలో పాల్గొన్న మహిళలు

హోరెత్తిన శైవ క్షేత్రాలు

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

కార్తీకమాసం సందర్భంగా రాష్ట్రంలోని పలు శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక సోమవారం, పౌర్ణమి కలిసి వచ్చిన వేళ మండలంలోని బుక్కూరులో సాయిబాబా ఆలయంలో వద్ద లక్ష్మీశివలింగం, త్రిశూలం ఆకారంలో దీపారాధన కనుల పండువగా నిర్వహించారు. మహిళలు కార్తికదీపాలు వెలిగిస్తూ తమ మొక్కులను చెల్లించుకున్నారు.

- బెల్టుషాపు కోసం వేలం
- తలయారీతో గ్రామాల్లో దండోరా
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జనం

పక్క పక్కనే ఉన్న కాశిందొరవలస, నారాయణప్పవలస

సర్కారు వారి మద్యం పాట

మండలంలో ఆ రెండు గ్రామాలు పక్కపక్కనే ఉన్న జంట పంచాయతీలు. ఆ పంచాయతీలకు ఓ విద్యుత్తు స్తంభమే హద్దు. అటు, ఇటు రెండు వీధులు చొప్పన ఉన్నాయి. ఆ రెండు పంచాయతీలకు ఇద్దరు సర్పంచులున్నా ఒకటే గ్రామ సచివాలయం. వారి కనుసన్నల్లోనే బెల్టుషాప్ నిర్వహణకు గత నెల 30న గ్రామ తలయారీతో మద్యంపాటలో పాల్గొనాల్సిందిగా దండోరా వేసి, వేలం నిర్వహించడం గమనార్హం. ఆ రెండు పంచాయతీల ప్రథమపౌరులూ అధికార పార్టీ మద్దతుదారులే కావడం విశేషం. ఇంతకీ ఎక్కడ, ఏం జరిగింది? అంటారా..! అయితే ఈ కథనం చదవాల్సిందే.

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

అధికారంలోకి వస్తే మద్యనిషేధం చేస్తామంటూ గద్దెనెక్కిన వైసిపి సర్కారు.. తరువాత దశాలవారి మద్య నిషేధమంటూ ప్రభుత్వ మద్యం దుకాణాలను తీసుకొచ్చింది. మద్యం రేట్లు పెంచి తాగేవారిని తగ్గించేం దుకేనని చెప్పుకొచ్చింది. పై రెండూ అమలు కాలేదు. ఇప్పుడు ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో కొత్త చిక్కొచ్చి పడింది. గ్రామగ్రామాన బెల్టుషాపులు తెరిచేందుకు ప్రయత్నాలు సిద్ధమవుతున్నాయి. ఇందుకు నిదర్శనంగానే కాశిందొరవలస, నారాయణప్పవలస.. జంట పంచాయతీలు కలిసి మద్యం బెల్టుషాపు నిర్వహణకు దండోరా వేయించి మరీ, వేలంపాట నిర్వహించాయి. కాసిందొరవలస గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు లక్షా 80 వేల రూపాయలకు మద్యం అమ్ముకొనేందుకు ముందుకొచ్చారు. వారికి రూ.40 వేలు లాభమిచ్చి నారాయణప్పవలసకు చెందిన మరో వ్యక్తి బెల్టుషాపును దక్కించుకున్నాడు. పాటకు సంబంధించిన మొత్తాన్ని ఈ నెల 6న పంచాయతీల పెద్దలకు అప్పగించారు. ఈ మద్యం పాట దండోరా వ్యవహారం ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. రెండు పంచాయతీల సర్పంచులు వైసిపి మద్దతుదారులే. ఇరు పంచాయతీలకు సంబంధించిన సచివాలయం గ్రామాలకు నడిబొడ్డున ఉన్నప్పటికీ ఇలాంటి అనైతిక కార్యకలాపాలు నిర్వహించేందుకు తలయారి ద్వారా దండోరా వేసి, వేలంపాట వేయడం పట్ల ఆయాగ్రామాల్లో ప్రజలు విస్తుపోతున్నారు. వెంటనే బెల్టుషాపు నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు అధికారులను కోరుతున్నారు.

జెంటిల్‌మేన్ ఒప్పందం

బెల్టుషాపు దక్కించుకొన్న వ్యక్తి క్వార్టర్ బాటిల్‌కి రూ.50 అదనంగా వేసుకుని విక్రయించాలి. మద్యం సీసాలు గ్రామానికి తీసుకు వస్తుండగా మార్గం మధ్యలో పోలీసులకు గానీ, ఎక్సైజ్ అధికారులకు గానీ పట్టుబడితే మద్యం పాటదారే బాధ్యత వహించాలి. గ్రామంలో అమ్ముతుండగా పట్టుబడితే గ్రామపెద్దలు బాధ్యత వహించేలా వేలం నిర్వహించారు.

హెచ్‌ఎంపై వేటు ఖాయమేనా?

- లైంగిక వేధింపులు నిజమేనన్న బాలికలు
- విచారణ నివేదిక ఆధారంగానే చర్యలు
- జాప్యం చేస్తే పోరుకు సిద్ధమన్న గిరిజన, ప్రజా సంఘాలు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన హెచ్‌ఎం కృష్ణారావుపై ఇటీవల నిర్వహించిన విచారణలో పాఠశాల బాలికలు తమ అభిప్రాయాలను నిర్భయంగా చెప్పినట్లు తెలుస్తోంది. పార్వతీపురం ఆర్‌డిఒ కె.హేమలత నేతృత్వంలో ముగ్గురు మహిళా అధికారులతో కూడిన కమిటీ సభ్యులు ఈనెల 5న పాఠశాలలో విచారణ చేపట్టారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8గంటల వరకు విచారణ నిర్వహించారు. హెచ్‌ఎంపై ఫిర్యాదు చేసిన బాలికలను ఒక్కొక్కరిని పిలిచి కమిటీ సభ్యులు వారి వాంగ్మూలాన్ని రికార్డు చేసినట్లు తెలిసింది. వీడియోలు కూడా తీయించారనే వాదనలు వినిపిస్తున్నాయి. హెచ్‌ఎం సమక్షంలోనే విద్యార్థినులు నిర్మొహమాటంగా చెప్పినట్లు తెలుస్తోంది. హెచ్‌ఎం తమను వేధింపులకు గురి చేశారనే అభిప్రాయాలను వారు వ్యక్తం చేసినట్లు సమాచారం. ఒకవైపు విచారణ జరుగుతుండగా పాఠశాల గేటు ముందు గిరిజన సంఘాలు ధర్నా చేపట్టాయి. గిరిజన బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఒక వేళ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు చర్యలు తీసుకోకపోతే అన్ని గిరిజన సంఘాలతో కలిసి ఐక్యపోరాటం చేపడతామని హెచ్చరించాయి.

ఆర్‌డిఒ నివేదిక పై ఆశలు

పార్వతీపురం ఆర్‌డిఒ హేమలత ఆధ్వర్యాన ఐసిడిఎస్ పిడి వరహాలు, డివిఇఒ మంజులవీణ బాలికలను విచారించారు. సుదీర్ఘంగా సాగిన విచారణలో బాలికల అభిప్రాయాలను అధికారులు రికార్డు చేసుకున్నారు. హెచ్‌ఎం కృష్ణారావు లైంగిక వేధింపులకు పాల్పడిన విషయాన్ని సెప్టెంబర్ 16న బాలికలు ఎస్‌ఎఫ్ఐ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.పండు, డివిజన్ నాయకులు వరుణ్‌కు గిరిజన బాలికలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులకు సంబంధించిన అంశాన్ని లిఖితపూర్వకంగా అందజేశారు. అదే రోజు ఎస్‌ఎఫ్ఐ నాయకులు బాలికలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులకు సంబంధించిన అంశాన్ని మీడియా దృష్టికి తీసుకొచ్చారు. సెప్టెంబరు 17న అన్ని పత్రికల్లో దీనిపై వార్తలు రావడంతో జిల్లా అధికారులు విచారణకు ఆదేశించారు. అదేరోజు సహాయ గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు పాఠశాలలో విద్యార్థినులను విచారించారు. ఆయన విచారణ చేపట్టిన తీరు పలు అనుమానాలకు తావిచ్చింది. అనుకున్న విధంగానే ఆయన ఆరోపణలు ఎదుర్కొన్న హెచ్‌ఎంకు అనుకూలంగా నివేదిక అందజేయడంతో గిరిజన సంఘాలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాయి. దీంతో మలివిడత విచారణ కు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తొలి విడత విచారణ తర్వాత దసరా సెలవులు రావడంతో కొంత వరకు జాప్యం జరిగింది. అయితే దసరా సెలవులు తర్వాత కూడా నెలరోజులు అధికారులు జాప్యం చేయడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. విచారణ ఎప్పుడని జిల్లా అధికారులను గిరిజన సంఘాలు ప్రశ్నించిన తర్వాత జెసి ఆనంద్ తేదీ ఖరారు చేశారు. ఎట్టకేలకు విచారణ పూర్తయింది. అయితే విచారణ చేపట్టడానికి ఎక్కువ సమయం తీసుకోవడంతో హెచ్‌ఎం కృష్ణారావు కురుకుట్టి స్థానిక నాయకులతో కలిసి ఆరోపణలు చేసిన విద్యార్థినుల ఇళ్లకు వెళ్లి బెదిరింపులకు పాల్పడ్డారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భయపడి ఒక పదోతరగతి విద్యార్థిని పాఠశాలకు రావడం మానేసినట్లు సమాచారం. ఎట్టకేలకు అధికారులు నిర్వహించిన దర్యాప్తులో హెచ్‌ఎం వికృత చేష్టలపై విద్యార్థినిలు తమ వేధింపులను వెల్లడించినట్టు తెలిసింది. ఇక నివేదిక వెల్లడే తరువాయి.

హెచ్‌ఎం కృష్ణారావు వేధింపులపై ఎస్‌ఎఫ్ఐ నాయకులకు విన్నవిస్తున్న విద్యార్థినులు (ఫైల్)

సంగంవలసలో వరికోతల్లో నిమగ్నమైన రైతులు

ప్రారంభమైన వరికోతలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలో ఈఏడాది ఖరీఫ్ వరికోతలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. వారం రోజుల క్రితమే ప్రారంభం కావాల్సి ఉండగా, ఆకాశంలో మబ్బుల కారణంగా రైతులు వేచిచూసే ధోరణి అవలంభించారు. బందలుప్పి, సంగంవలస, అడ్డాపుశిల, నరిసిపురం, తాళ్లబురిడిలో వరికోతల సందడి కనిపిస్తుంది. గత రెండురోజులుగా ఆకాశం నిర్మలంగా ఉండడంతో పాటు ఎండలు అనుకూలించడంతో వరికోతలు ప్రారభించారు. ఖరీఫ్ సీజన్ మొదలవ్వడంతో వ్యవసాయ కూలీలకు చేతుల నిండాపని దొరికే అవకాశాలు ఉన్నప్పటికీ ధాన్యం నూర్పు యంత్రాలు తమ అవకాశాలు కొల్లగొడతున్నాయని వాపోతున్నారు.

రాగల ఐదు రోజుల వాతావరణ సూచన

కురుపాం : రాగల ఐదు రోజుల్లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండి, ఉమ్మడి జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 33-34 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 19 డిగ్రీలు, గాలిలో తేమశాతం 58-62 శాతం, గాలి గంటకు 7 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం వైపు వీచే అవకాశం ఉందని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎస్.స్రవంతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వాతావరణ పరిస్థితుల వల్ల వరిలో సుడిదోమ ఆశించే అవకాశం ఉందన్నారు. నివారణకు ఎతోఫెన్ప్రాక్స్ 400 మి.లీ లేదా బూప్రోఫెజిన్ 360 మి.లీ లేదా ట్రైఫ్లూమిజో పైరిమ్ 98 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ జి.అమృతవీణ తెలిపారు.

24 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - పాచిపెంట

ఒడిశాలోని కోరాపుట్ జిల్లా ధమన్‌జోడి నుంచి విశాఖ వస్తున్న ఎపిఎస్‌ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తున్న 24 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ బి.ధనంజయరావు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సులో అక్రమంగా గంజాయిని తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు ఆదివారం ఉదయం స్థానిక ఎస్సై ఎంవి రమణ తన సిబ్బందితో పి.కోనవలస చెక్‌పోస్ట్ వద్ద బస్సును తనిఖీ చేశారు. మతాలిపుట్ గ్రామానికి చెందిన చందన్ కుమార్ రౌతు అనే యువకుడు 24 కేజీల గంజాయిని కలిగి ఉండడాన్ని గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని అక్రమ రవాణాకు పాల్పడిన యువకుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత పాచిపెంట పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 2007 కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకుని 6 కేసులు నమోదు చేసి 13 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు. అలాగే 1900 నాటుసారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని 26 మందిని అరెస్టు చేసి పది వాహనాలను సీజ్ చేసి 108 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. విలేకరుల సమావేశంలో పోలీసులు పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడ్డ యువకుడ్ని విలేకరుల సమావేశంలో ప్రవేశపెట్టిన సిఐ, ఎస్ఐ

సాంకేతిక పరిజ్ఞానం పెంపునకు ల్యాబ్‌లు దోహదం

ప్రజాశక్తి- సీతంపేట

గిరిజన విద్యార్థులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు లాబ్‌లు ఎంతో దోహదపడతాయని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని మల్లి, దోను భాయి ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో ఆటల్ టింకరింగ్ ల్యాబ్‌లను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి ల్యాబ్‌లు విద్యార్థులకు ఎంతగా ఉపయోగపడతాయన్నారు. కావున విద్యార్థులు వీటిని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం లాబ్ లో ఉన్న పరికరాలు, అవి పనిచేసే విధానం గురించి విద్యార్థులను అడిగి జవాబులు రాబట్టారు. రోబోటిక్స్, టెలిస్కోప్, 3-డి డెవలపర్, డ్రోన్, టెలిస్కోప్ తదితర వాటి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థి గిరియో ఇంగ్లీష్‌లో లాబ్ వల్ల ఉపయోగం, ఎలా సద్వినియోగం చేసుకుంటారో చక్కగా వివరించి ఎమ్మెల్యేతో అభినందనలు పొందాడు. సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దోనుబయి పాఠశాలశాలలో విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆమె సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులకు అందుతున్న భోజనం గురించి అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు అనంతరం ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ గా చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణ, ఎంపిసి చైర్మన్ మోహనరావు, సర్పంచ్ వెంకినాయుడు, ఎంపిటిసి సభ్యులు కోటేశ్వరరావు, ఒఎస్‌డి యుగంధర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె.సుబ్బారావు, పాలక నారాయుడు, లిల్లీరాణి, ఎఎంఒ కోటి బాబు తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ వల్ల ఉపయోగాలకు ఎమ్మెల్యేకు వివరిస్తున్న విద్యార్థి

300 మందికి దుప్పట్లు పంపిణీ

సీతంపేట : మండలంలోని పులిపుట్టి పంచాయతీ పరిధిలో ఉన్న రామకిరి క్షేత్రం ప్రాంగణంలో సోమవారం జగద్గురు పీఠం భౌగోళిక అంతర్జాతీయ అధ్యక్షులు మాస్టర్ పార్వతి కుమార్ 78 జన్మదిన సందర్భంగా వాల్మీకి వనవాసి శ్రేయ సంస్థ అధ్యక్షులు ఎస్వీ పెంటయ్య చేతుల మీదుగా 300 మంది వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు, నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఏటా మాస్టర్ పార్వతి కుమార్ పేరున నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ నవీన్, కమిటీ సభ్యులు జి ప్రసాద్ బాబు, గంట రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

సీతంపేట: మండలంలోని జగతపల్లి, దుక్కిణిగూడ పాఠశాలలను ఎంపిడిఒ కె. గీతాంజలి సోమవారం సందర్శించారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్నారు. చిన్నారులకు సులువు పద్ధతుల్లో బోధించాలన్నారు.

పంపిణీకి సిద్ధంగా పాఠ్యపుస్తకాలు

వీరఘట్టం: మండలంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీకి రెండో విడత పాఠ్యపుస్తకాలు స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో సిద్ధంగా ఉన్నట్లు మండల విద్యాశాఖ అధికారి పి. కృష్ణమూర్తి సోమవారం తెలిపారు. ఒకటో తరగతి నుండి 8వ తరగతి వరకు సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. వీటిని ఈ నెల తొమ్మిదో తేదీ నుండి పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేశారు.

ఆపద సమయంలో దిశయాప్ రక్ష

పాలకొండ రూరల్: దిశ యాప్ ఆపద సమయంలో ఆత్మ రక్షణ, స్వీయ రక్షణ కోసం ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రేవతి అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ 1,2 ఆధ్వర్యంలో దిశ యాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ సెల్‌ఫోన్‌లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. యువతీ, యువకులు దిశ యాప్ వినియోగంపై అవగాహన పెంచుకొని అత్యవసర సమయంలో రక్షణ పొందాలన్నారు. దిశ యాప్ ఏ విధంగా వినియోగించాలో విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జర్మన్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ బి. ప్రభాకరరావు, ఐక్యుఎసి కోఆర్డినేటర్ బి. రాజు, కోఆర్డినేటర్ ఎం.ఎస్. కుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

వీరఘట్టం: మండలంలో కత్తుల కవిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జి. రాంబాబు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఈత పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయులు పి. కృష్ణమూర్తి అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు తూముల మధుసూదనరావుకు కూడా అభినందనలు తెలిపారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

భామిని : మండలంలోని బిల్లుమడ పంచాయతీ పరిధిలోని 7 గురికి సోమవారం బిల్లుమడ వైసిపి నాయకులు సిగడాన రాజు, ఎంపిటిసి బూసి బాలకృష్ణ ఇళ్ల పట్టాలను అందజేశారు. ఎవ్వరూ లేని విధంగా రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది అని, అర్హులైన ప్రతీ ఒక్కరు లబ్ది పొందుతున్నారని ఇటువంటి ప్రభుత్వం ఎన్నుకోవాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే కళావతిని మరోసారి గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బూసి సంతోష్, వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ శ్రవణ్ పాల్గొన్నారు.

పింఛను తొలగింపు అన్యాయం

వీరఘట్టం : మండలంలోని కంబర గ్రామానికి చెందిన కొండపల్లి స్వామి నాయుడు పింఛనును అధికార పార్టీ నాయకులు తొలగించడం అన్యాయమని జనసేన పార్టీ నియోజకవర్గ వర్గం నాయకులు జి సత్తిబాబు విమర్శించారు. సోమవారం ఆ గ్రామానికి వెళ్లి స్వామినాయుడుకు విశ్రాంత ఉద్యోగి నాగేశ్వరరావు కొంత ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ స్వామి నాయుడు కుమారుడు శివ కుమార్ పార్టీ క్రియ శీలక కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నాడన్న కక్షతో అధికార పార్టీ నాయకులు స్వామి నాయుడు పెన్షన్ పూర్తిగా తొలగించారని ఆరోపించారు. స్వామి నాయుడుకు జనసేన పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని భరోస ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి నరేంద్ర, సాయికుమార్, సునీల్, పి. సంతోష్, రాంబాబు, ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఎంపిపి తనిఖీ

జియ్యమ్మవలస: మండలంలోని శిఖబడి పంచాయతీ సచివాలయాన్ని ఎంపిపి బొంగు సురేష్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. సచివాలయానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 లక్షల నిధులతో ఏఏ పనులు చేపడుతున్నారో పరిశీలించారు. జగనన్న విద్యా దీవెన, అమ్మఒడి, చేయూత, ఇబిసి, నేస్తం తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రం భవన నిర్మాణం చేపట్టే స్థలాన్ని పరిశీలించారు. పాత భవనాన్ని తొలగించి కొత్త భవనాన్ని నిర్మించడానికి స్థలం సిద్ధం చేస్తున్నారు. ఆ స్థలాన్ని ఎంపిపి పరిశీలించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం

కొమరాడ: ప్రజలకు కేన్సర్ వ్యాధిపై అవగాహన ఉంటే ఆరోగ్యం సాధ్యమని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ రజినికుమారి అన్నారు. సోమవరం స్థానిక బిఆర్ అంబేద్కర్ గురుకులం బాలికల పాఠశాల, కళాశాలలో సోమవారం నోబుల్ బహుమతి గ్రహీతలు సర్ సివి రామన్, మేరీక్యూరీల జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. జాతీయ కేన్సర్ దినోత్సవంలో భాగంగా పాఠశాల సిబ్బంది, విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కేన్సర్‌పై అవగాహన పెంచుకొని వ్యాధి నిరోధకశక్తి పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పాప, బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నాటు సారా ప్యాకెట్లతో ఇద్దరు పట్టివేత

పార్వతీపురంటౌన్ : పట్టణంలోని సోమవారం స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ సూర్యారావు తన సిబ్బందితో కలిసి ఫ్లైఓవర్ పై వాహన తనిఖీలు చేశారు. అదే సమయంలో పార్వతీపురం నుంచి గోపాలపురం వెళ్తున్న అఖిల్, తేజ తమ ద్విచక్ర వాహనంలో 45నాటు సారా ప్యాకెట్లు ఉండడాన్ని గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకొని పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జోరుగా ఓట్ల నమోదు

పార్వతీపురంరూరల్ : మండలంలో పట్టభద్రుల ఓట్ల నమోదు సోమవారం జోరుగా సాగిందని ఎంపిడిఒ అకిబ్‌జావేద్ తెలిపారు. తమ కార్యాలయం నుంచి వెయ్యి వరకూ నమోదైనట్లు తెలిపారు. మండలంలోని కార్యదర్శులంతా ఉత్సాహంతో పనిచేశారని, ఆన్‌లైన్‌లోనూ, ఇంకా చాలమంది తమకు దగ్గరలోని ఓటరు నమోదు కేంద్రాల ద్వారా నమోదు చేయించుకున్నారన్నారు.

పిఒకు సర్పంచ్ వినతి

గుమ్మలక్ష్మీపురం : మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురానికి ఎలక్ట్రికల్ ఎనర్జీ అసిస్టెంట్ పోస్ట్ మంజూరు చేయాలని కోరుతూ ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేసినట్లు సర్పంచ్ బి.గౌరీశంకర్రావు తెలిపారు. అలాగే పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు. దీనికి పిఒ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

గుమ్మలక్ష్మీపురం : మండలంలో పలు సచివాలయాల పరిధిలోని నిర్మాణం చేపడుతున్న జగనన్న గృహాల పనులను వేగవంతం చేసేలా సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులు, హౌసింగ్ శాఖ సిబ్బంది కృషి చేయాలని ఇన్చార్జి ఎంపిడిఒ జి.జగదీష్‌కుమార్ కోరారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ సహాయకులు, హౌసింగ్ శాఖ సిబ్బంది సమీక్షలో పాల్గొని మాట్లాడారు. మండలంలో 742 జగనన్న గృహాలు మంజూరు కాగా, ఇప్పటి వరకూ 542 గృహాలు వివిధ స్థాయిల్లో ఉన్నాయన్నారు. మిగతా 215 జగనన్న ఇళ్లు త్వరితగతిన గ్రౌండింగ్ చేసేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ మేరకు మండల హౌసింగ్ శాఖ ఎఇ ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగనన్న గృహాలను వేగవంతం చేసి పురోభివృద్ధి సాధించాలన్నారు. సమావేశంలో పలు సచివాలయాల ఇంజనీరింగ్ సహాయకులు, హౌసింగ్ సిబ్బంది, పాల్గొన్నారు.

స్పందనకు ఫిర్యాదుల వెల్లువ

ప్రజాశక్తి - కలెక్టరేట్

స్పందన కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ పి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. 90 దరఖాస్తులు స్పందన కార్యక్రమంలో అందాయి. అర్జీల వివరాలిలా ఉన్నాయి.

పాచిపెంట మండలం పద్మాపురం పంచాయతీ మాలమామిడికి చెందిన గిరిజనులు మోసూరు డిపోకు రేషన్ సరుకులు ఇప్పించాలని కోరారు. జియ్యమ్మవలస మండలం పనుగులగూడకు చెందిన ఎం.రామారావు గడిసింగుపురం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 189 ప్రభుత్వ భూమిని సర్వే చేసి గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. మక్కువ మండలం పనసభద్రకు చెందిన కె.పార్వతి పట్టా నెంబర్ 275 రీసర్వేలో తన భూమిని చేర్చినట్లు కనిపించడంలేదని వెంటనే తన పేరు రీ సర్వేలో చేర్చాలని కోరారు. కొమరాడ మండలం లాబేసు గ్రామానికి చెందిన బి.మోహన్ రావు ఆరోగ్యశ్రీ కార్డు మంజూరు చేయాలని అర్జీ అందజేశారు. కుంతేసు గ్రామానికి చెందిన బి.గోపీచంద్ రేషన్ కార్డ్ మంజూరు చేయాలని కోరారు.మక్కువ మండలం కొయ్యానపేటకు చెందిన కె.లక్ష్మణమ్మ వితంతు పింఛను ఇప్పించాలని కోరారు. సీతానగరం మండలం ఆర్‌వెంకంపేటకు చెందిన ఎం.రాము తనకు సదరం సర్టిఫికెట్ మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. వీరఘట్టం గ్రామానికి చెందిన వి.శోభారాణి వితంతు పింఛను మంజూరు చేయాలని కోరారు. పార్వతీపురం పట్టణంలో పందుల బెడద ఉందని రైతులు తీవ్ర నష్టానికి గురవుతున్నారని ఎం.రమేష్ కుమార్ వినతిపత్రం అందజేశారు. స్పందన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథ రావు, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎ.ఈశ్వర రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎంవిజి కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, డిఆర్‌డిఎ, గృహ నిర్మాణ సంస్థ, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్లు పి.కిరణ్‌కుమార్, పి.రఘురాం, కె.రామచంద్రరావు, డిఇఒ డాక్టర్ ఎస్‌డివి రమణ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి.చిట్టిబాబు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, డిఎస్ఒ కెవిఎల్ఎన్ మూర్తి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి జి.వరహాలు, జిల్లా మలేరియా అధికారి కె.పైడిరాజు, డిపిఒ బి.సత్యనారాయణ, జిల్లా ఔషధ నియంత్రణ అధికారి ఎ.లావణ్య, జిల్లా రవాణా అధికారి ఎం.శశికుమార్, జిల్లా ప్రధాన అగ్ని మాపక అధికారి కె.శ్రీను బాబు, జిల్లా ప్రజా రవాణా అధికారి టివిఎస్ సుధాకర్, క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా రిజిస్ట్రార్ ఎంఎస్‌కె పూర్ణచంద్, జిల్లా ఉద్యాన అధికారి కె.వి.ఎస్.ఎన్ రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి పి. సీతారాం తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, జెసి ఓ ఆనంద్

సీతంపేట: ఎపిఒ రోషి రెడ్డికి వినతినిస్తున్న సిపిఎం నాయకులు

కళాశాలలో సమస్యలు పరిష్కరించండి

సీతంపేట : మండల కేంద్రంలో ఉన్న గవర్నమెంట్ మోడల్ పాలి టెక్నిక్ కళాశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయులను సిబ్బందిని నియమించాలని ఐటిడిఎ స్పందన కార్యక్రమంలో ఎపిఒ రోషి రెడ్డికి సిపిఎం నాయకులు వినతిపత్రం సమర్పించారు. పాలిటెక్నిక్ కళాశాల ల్యాబ్‌లో విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలన్నారు. 2014లో పాలిటెక్నికల్ కళాశాల ఏర్పాటు చేసినప్పటికీ డిప్టేషన్ పై కొనసాగిస్తున్నారే తప్ప రెగ్యులర్ సిబ్బందిని నియమించలేదని అన్నారు. అసలు పోస్టులే మంజూరు చేయలేదని చెప్పారు. అందుకే విద్యార్థులు జాయినింగ్ అవ్వడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. సబ్జెక్ట్ టీచర్స్ బోధకులు భర్తీ చేయాలనీ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం తిరుపతిరావు, మండల కార్యదర్శి ఏ భాస్కరరావు, శ్రీరాములుసాంబయ్యలు వినతి సమర్పించారు. మెళియపుట్టి మండలం బాణాపురం గ్రామానికి చెందిన వాసుదేవరావు ఆటో లోను ఇప్పించాలని విన్నవించారు. ఇప్పగూడ గ్రామానికి చెందిన ఆరిక నూపతోలియ, బింతోనిలు తమకు ఇల్లు మంజూరు చేయాలని విన్నవించారు. గాదిలంక మూలలంకకు చెందిన ఆరిక జీవం కంప్యూటర్ కాటా ఇప్పించాలని కోరారు. ఈ స్పందన కార్యక్రమంలో సిడిపిఒ రంగలక్ష్మి, వెలుగు ఎపిడి నారాయణరావు, ఎపిఒ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ వద్ద టిడిపి నిరసన

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని టిడిపి కార్యాలయం నుండి ఐటిడిఏ వరకు గిరిజన సమస్యలపై పాలకొండ నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ నిమ్మక జయక్రిష్ణ ఆధ్వర్యంలో సోమవారం చలో ఐటిడిఎ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయ, వాల్మీకి, బెంతుఒరియా, మత్స్యకారులను, ఎస్‌టి జాబితాలో కలిపాలని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆనంద్ శామ్యూల్, ఏక సభ్య కమిటీని నియమించి జీవో నంబర్-52ను విడుదల చేసిందని దీనిని వ్యతిరేకిస్తున్నామని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సవర బాషా వలంటీర్స్ ను తక్షణమే రెన్యువల్ చేయాలని, జీవో నెంబర్-3 షెడ్యూల్ ప్రాంతంలో తిరిగి పునరుద్దించాలని, నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో కలపాలని డిమాండ్ చేశారు. రోడ్లు సౌకర్యాలు లేని గ్రామాలకు రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఏనుగుల విధ్వంసం వల్ల పాడయ్యే పంటలకు నష్టపరిహారం అందిస్తూ, ఏనుగులను శాశ్వతంగా సీతంపేట మండలం నుండి తరలింపు చేయాలని డిమాండ్ చేశారు. ఐటిడిఎ ఎపిఒ రోషి రెడ్డికి వినతిపత్రం అందచేశారు.

ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, సవరతోట ముఖలింగం తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటిన్ ప్రారంభం

మండల కేంద్రంలో సోమవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జీ నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో అన్నా క్యాంటిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో టిడిపి అధికారంలోకి వస్తుందని అన్నా క్యాంటిన్‌ను శాశ్వతంగా ఉంటుందని చెప్పారు.

రైతు ప్రదర్శన పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 10న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మహా ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు కోరారు. మండలంలో పలు గ్రామాల్లో పర్యటన సందర్భంగా సోమవారం సింగన్నవలస గ్రామంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర రూ.2,800 ఇవ్వాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకి ఇప్పటి నుండే తగు చర్యలు తీసుకోవాలని, గతేడాది ప్రచారం ఆర్భాటం తప్ప సకాలంలో రైతుల దగ్గర నుంచి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది రైతు సమస్యలు పరిష్కారం కొరకు గ్రామాల వారీగా రైతులందరూ ఐక్యం కావాలని, జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం ప్రతినిధులు ఎం విజయకుమార్, బి. భాస్కరరావు, ఎం. అప్పన్న, గ్రామ రైతులు ప్రచార కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వీరికి మద్దతుగా సిఐటియు పాలకొండ మండల సమన్వయ కమిటీ కార్యదర్శి కె. రాము పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

ఆర్‌బికెల ద్వారా ప్రకృతి వ్యవసాయం

ప్రజాశక్తి -పాచిపెంట

రైతు భరోసా కేంద్రాలను అనుసంధానించుకొని ప్రకృతి వ్యవసాయాన్ని మండలంలో విస్తరించాలని ఆశాఖ సిబ్బందికి మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు సూచించారు. మండలంలో కుడుమూరు, కర్రివలస క్లస్టర్లు ఉన్నాయని, 10మంది సిబ్బంది పనిచేస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు రావట్లేదని అన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని రైతు ముంగిటకు తీసుకువెళ్లేలా ప్రణాళికలు వేయాలన్నారు. గ్రామాల్లో చేసే కార్యక్రమాలను ముందు రోజే రైతులకు రైతు భరోసా కేంద్రం సిబ్బందికి వ్యవసాయ అధికారికి తప్పనిసరిగా తెలియజేయాలని కోరారు. కుడుమూరు క్లస్టర్ పరిధిలో గురువునాయుడుపేట, పాంచాలి, మాతుమూరు రైతు భరోసా కేంద్రాల పరిధిలో పొగాకు పంట ఎక్కువగా పండిస్తారని మ్యూ రైట్ ఆఫ్ పొటాష్‌గా పిలవబడే ఎర్ర పొటాష్ వాడకూడదని అన్నారు. ప్రకృతి సేద్య పద్ధతుల ద్వారా జిల్లేడు కషాయాన్ని పొగాకు పంటలో ఎర్ర పొటాషియం ప్రత్యామ్నాయంగా రైతులు వినియోగించేలా చూడాలని తెలిపారు. గిరిజన గ్రామాల్లో ఎక్కువగా చోడి పంట పండిస్తారని, గులిచోడి అనే సులువైన కొత్త విధానాల ద్వారా ఎకరాకు 20 బస్తాలకు పైగా దిగుబడి వస్తుందన్నారు. మండలంలో రబీ సీజన్‌లో మొక్కజొన్న పంట అధిక విస్తీర్ణంలో సాగు చేస్తారని ఈ పంటపై రెండు ఆకుల దశనుండే కత్తెర పురుగు ఆశించి రైతులకు అపార నష్టం కలుగజేస్తుందని అన్నారు. ఈ పురుగు నివారణకు మెటరైజం బ్యాక్టీరియా తయారుచేసి రైతులకు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మెంటార్ నరసింహ, సిఆర్‌పి బాలకృష్ణ పాల్గొన్నారు.

పాచిపెంట: సిబ్బందితో మాట్లాడుతున్న ఎఒ తిరుపతిరావు

ప్రకృతి వ్యవసాయం పరిశీలన

కురుపాం: మండలంలో సీడీమానుగూడ, సందిగూడ, భారతింగి గిరిజన గ్రామాల్లో జిల్లా వ్యవసాయ శాఖ మేనేజర్ షణ్ముఖరావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజన రైతులు సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం, అంతర్ పంటలను పరిశీలించి అనంతరం సిబ్బందితో మాట్లాడారు. ఐదు నుంచి పది రకాల విత్తనాలతో ప్రకృతి వ్యవసాయం గిరిజన గ్రామాల్లో గిరిజన రైతులు పండించేలా అవగాహన కల్పించారు. ఒక గ్రామంలో ఒకే రకమైన విత్తన పద్ధతిని అలవాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కె.భూషణరావు, తిరుపతిరావు, భాస్కరరావు, ధనంజయ, రైతులు పాల్గొన్నారు.

కట్టె జనుము సాగు లాభదాయకం

పాలకొండ రూరల్ : జిల్లాలో అపరాల దిగుబడి గణనీయంగా తగ్గుతున్న నేపథ్యంలో వరి మాగణులలో కట్టె జనుము పండించడం లాభదాయకంగా వుంటుందని అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు అన్నారు. ఎకరా విస్తీర్ణంలో పెసర, మినుము పంటలో క్వింటా కంటే తక్కువ దిగుబడి వస్తుందని, అదే కట్టె జనుము వేసుకుంటే ఎకరానికి 3 క్వింటాళ్ల దిగుబడి రావడం వలన పెట్టుబడి పోగా ఎకరాకు రూ.12 వేలు వస్తుందన్నారు. ఇందులో భాగంగా వరి మగాణులలో వేసే కట్టె జనుము ఎస్ హెచ్-4, ఎస్ యుఐఎన్-037 రకాల పరిశీలన పాలకొండ మండలం పిఆర్ రాజుపేట గ్రామంలో జరుగుతుందని తెలియజేశారు. ఈ రకాల్లో పోషకాలు లభ్యతలో భాగంగా 25-30 రోజుల్లో 19:19:19, 40-45 రోజుల్లో 13:0:45 పిచికారి చేయటం వల్ల దిగుబడి 5-8 క్వింటాళ్ల వరకు వస్తుం దని తెలియజేశారు. ఈ పరిశీలన ఏరువాక కేంద్రం విజయనగరం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె. లక్ష్మణ్ సహకారంతో చేస్తున్నానని, ఈ రకాలను వ్యవసాయ పరిశోధన స్థానం ఆమదాలవలస ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎల్.సూర్యనారాయణ అందించినట్టు తెలిపారు.

పాలకొండ రూరల్: పంటను పరిశీలిస్తున్న ప్రసాదరావు

విత్తన క్షేత్రం పరిశీలన

మండలంలోని పిఆర్ రాజుపేట గ్రామంలో అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు క్షేత్రంలో వేసిన ఎంటియు 1061 విత్తన క్షేత్రాన్ని ఎపి సీడ్ కార్పోరేషన్ ఫీల్డు సూపర్‌వైజర్ ఐ.కూర్మారావు సోమవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పొలంలో కేళీలు, ఇతర వరి విత్తనాలు లేవని తెలిపారు. ఎపి సీడ్ కార్పోరేషన్ వారు ప్రసాదరావుకు 8 ఎకరాలకు సరిపడ విత్తనాలు సరఫరా చేశారు. తిరిగి సర్టిఫికెట్ విత్తనాలను తీసుకునేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. మరలా కొంతమంది ఒక పర్యాయం వచ్చి పరిశీలించి ఎపిసీడ్స్ కార్పోరేషన్‌కు విత్తనాలు తీసుకోవడానికి అనుమతి పత్రం అందిస్తారు.

లక్ష్మీపురంలో ఫ్యామిలీ డాక్టర్

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పిహెచ్‌సి వైద్యాధికారి ప్రియాంక, 104 వైద్యులు డాక్టర్ వంశీబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచానికే పరిమితమైన వారి ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందించారు. అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి విద్యార్థుల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి వైద్యం అందజేశారు. అలాగే గర్భిణీలు, బాలింతలు, వయో వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారందరికీ ఆ గ్రామంలో వైద్య పరీక్షలు చేసి, నెలకు సరిపడే మందులు ఇచ్చి తగు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రసాద్, రమ, సంధ్య, పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని బాలగుడబలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పిహెచ్‌సి వైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచానికే పరిమితమైన వారి ఇంటికి వెళ్లి వైద్య సేవలందిస్తున్నట్టు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి పిల్లల ఆరోగ్యం తెలుసుకొని వారికి వైద్యం అందజేస్తున్నామన్నారు. గర్భిణు, వయోవృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారందరికీ వైద్య పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులిచ్చి తగు జాగ్రతలు తీసుకోవాలని వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, సంతోష్, సర్పంచ్ పొలమ్మ (పండు), శ్రీధర్, రామలక్ష్మి, జగదీశ్, పాల్గొన్నారు.

దళారుల ప్రమేయం వద్దు

కలెక్టరేట్: సీతానగరం మండలంలోని లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో రైతులు చెరుకు కొనుగోళ్లలో దళారుల దోపిడీ లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ను జనసేన నాయకులు కోరారు. సోమవారం వారు కలెక్టర్‌ను కలిసిన అనంతరం మాట్లాడుతూ ఇక్కడ చెరుకు పండించిన రైతులు సంకిలి షుగర్ ఫ్యాక్టరీకి తరలించడం వ్యయ ప్రయాశలతో కూడుకున్న వ్యవహారమన్నారు. కావున ఎప్పటిలాగే ఎన్‌సిఎస్ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని అన్ని తూనిక కేంద్రాల్లో చెరుకు కొనుగోలు చేయాలని కోరారు. గతేడాది క్షేత్రస్థాయిలో జరిగిన ఇబ్బందుల్ని పర్యవేక్షణలోకి తీసుకొని ఈ ఏడాది చెరుకు కొనుగోలులో దళారీ వ్యవస్థ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే రూ. 3500 మద్దతు ధర ఇవ్వాలని కోరారు. పాత బకాయిలు ఎప్పటిలోగా చెల్లిస్తారో తెలపాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసి వారిలో జనసేన నాయకులు ఆర్.రాంబాబు, బి.శిరీస్, ఎస్.గౌరీశంకర్, వి.దాలినాయుడు, ఎం.శరత్‌బాబు, రాగోలు రాంబాబు, ఎస్. గణేష్ తదితరులు ఉన్నారు.

పాటల పోటీలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక చింతలగూడ ద్రవ్య సహాయక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం పాటల పోటీలు నిర్వహించారు. రాష్ట్ర బాలకథానిలయం ప్రతినిధులు భోగెల ఉమామహేశ్వరరావు, పాలక దేవానంద్ విజ్ఞప్తి మేరకు దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పిన్నింటి చందన, గూనగెంజి గౌతమి, పాలక అంకిత, భోగి బిందు, నెమలపురి వర్శిని, నిమ్మక బిందు, బొత్తాడ యువన తదితర విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించారు. వీరందరికీ రాష్ట్ర బాల కథ నిలయం ఆధ్వర్యంలో ధ్రువపత్రాలను అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బేత కుమారస్వామి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల వాలంటీర్లు ప్రశాంతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం పరిశీలన

సీతానగరం : మండలంలోని పెదబోగిలి ఎస్‌డబ్ల్యుపి కేంద్రాన్ని ఎంపిడిఒ సోమవారం పరిశీలించారు. ఇక్కడ తయారు చేస్తున్న వర్మీ కంపోస్టును అమ్మకం జరిపి పంచాయతీ ఆదాయానికి తోడ్పాడటును అందించాలన్నారు. క్లాప్ మిత్రాలకు జీతభత్యాలు ఇచ్చేందుకు కూడా ఉపయోగపడే విధంగా మార్కెట్ లింకేజీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. షెడ్‌లో వున్న సాంకేతిక పరికరాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని, షెడ్ చుట్టు ప్రక్కల వున్న ఖాళీ స్థలాన్నీ వినియోగించాలన్నారు.

సర్పంచులతో సంబంధం లేకుండా వేతనాలు

ప్రజాశక్తి - కొమరాడ

సర్పంచులతో సంబంధం లేకుండా పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి అనంతరం వినతి పత్రాలు అందజేశారు. అనంతరం సాంబమూర్తి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చి అన్ని విధాలా అభివృద్ధికి తోడ్పడేలా పారిశుధ్య కార్మికులను నియమించామన్నారు. 9నెలలుగా వీరికి వేతనాలు చెల్లించకపోవడంతో అప్పుల పాలై జీవనం కడుదుర్భంగా ఉందన్నారు. కొంతమంది సర్పంచులైతే పనిచేస్తే చేయండి లేకపోతే మానేయండి మిమ్మల్ని ఎవరు నియమించారో వారినే అడగండంటూ చిర్రుబుర్రులాడే పడే పరిస్థితి ఉందని అన్నారు. కావున సర్పంచులు ప్రమేయం లేకుండా వెంటనే రాష్ట్ర ప్రభుత్వమే జీతాలిచ్చేలా చూడాలని కోరారు. లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పావను ప్రసాద్, భోగేసు, రాము, లక్ష్మణరావు, దాశరథి పాల్గొన్నారు.

వినతి పత్రాన్ని అందిస్తున్న సిపిఎం నాయకులు

భూములను కాపాడండి

ప్రజాశక్తి- పాలకొండ

మండలంలోని బాసురు గ్రామంలో 1970లో దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చిన భూములను కాపాడాలంటూ స్పందన గ్రీవెన్స్‌లో సోమవారం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫోరం జిల్లా ఇంఛార్జి కన్వీనర్ బత్తిని మోహన్ ఆధ్వర్యంలో బాసురు గ్రామ దళితులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 70 కుటుంబాల భూమికి సంబంధించిన అన్ని పేపర్లు ఉన్నప్పటికీ రెవెన్యూ సిబ్బంది ఆ భూమి పేపర్లు చెల్లవని ఆందోళనకు గురి చేస్తున్నారని సబ్ కలెక్టర్ వివరించారు. దళితులకు చెందిన భూములను కాపాడాలని, ఇప్పటికే కొంతమంది దళితులు వద్ద భూములు తీసుకున్నారని, భూమిలేని నిరుపేదల వద్ద భూములు తీసుకోవడం ఎంతవరకు సమంజసమని, ఆయకట్టు లేని చెరువుల పేరు చెప్పి దళితులు వద్ద ఉన్న భూమిని లాక్కునే ప్రయత్నం చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో బాసూరు గ్రామదళిత యువజన సంఘం, దళిత మహిళా సంఘం, దళిత పెద్దలు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలని సబ్ కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి- పాలకొండ

గ్రామ సచివాలయాల్లో తమకు సౌకర్యాలు కల్పించాలని విఆర్‌ఒలు బంకి రాజా, బలివాడ శ్రీనివాసరావు, కోట శ్రీనివాసరావు, ధనలక్ష్మి తదితరులు సోమవారం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. సచివాలయాల్లో 90శాతం ఆన్‌లైన్ సర్వీసులే జరుగుతున్నాయని, అయితే సచివాలయాల్లో తమకు ఎటువంటి సదుపాయాలు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రస్తుతం రీసర్వే చేపడుతున్న విఆర్‌ఒలకు కంప్యూటర్‌తో పాటు రికార్డులను పొందుపర్చుకోవడానికి బీరువాలు ఇవ్వాలన్నారు. రీసర్వేకు అవసరమైన కంప్యూటర్ లేకపోవడం వల్ల బయట నెట్‌సెంటర్‌కు వెళ్లి వ్యక్తిగతంగా డబ్బులు చెల్లించి పనులు చేసుకుంటున్నామన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

సబ్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న విఆర్‌ఒలు